

బోగస్ సొసైటీలకు రూ.102 కోట్లు బదిలీ

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అవినీతిపై విచారణ సాగుతున్న తరుణంలోనే బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)లో రూ.102 కోట్ల నగదు బదిలీ వెలుగులోకి వచ్చింది. వివాదానికి సంబంధించి 9 మంది అధికారులపై కేసులు నమోదయ్యాయి. బీబీఎంపీ అధికారులు కొవిడ్ సమయంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో బోగస్ సొసైటీలకు రూ.102 కోట్లు బదిలీ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వితంతువులకు కేటాయించిన నిధులను బదిలీ చేశారు. విచారణకు బీబీఎంపీ అధికారులు సిద్ధమయ్యారు.



మహదాయికి మహర్దశ

- తుది దశకు కళసా-బండూరి ప్రాజెక్టు

మహ దాయి నది



మహ దాయి నది మ్యాప్

- కేంద్ర వన్యజీవి మండలి అనుమతులు ఒక్కటే పెండింగ్
- ఢిల్లీ ఎంపీల విందులో కేంద్ర మంత్రులతో సీఎం చర్చ

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం, ట్రిబ్యునల్ స్పందన, రాజకీయ పార్టీల హామీలు ఇలా అన్నీ కలిపి కళసా-బండూరి ప్రాజెక్టు తుదిదశకు చేరింది. గురువారం రాత్రి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలకు ఇచ్చిన విందులో దీనిపై చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ప్రహ్లాదజోషి, కుమారస్వామి కూడా హాజరయ్యారు. రాష్ట్ర ప్రయోజనాలకు సాధించుకోవడానికి పార్టీలకు అతీతంగా కలిసి రావాలని వారిని సీఎం ఆహ్వానించినట్లు తెలుస్తోంది. మహదాయి పూర్తయితే తాగునీటి సమస్య తీరుతుందని వివరించినట్లు తెలుస్తోంది. పశ్చిమకనుమల్లో పుట్టే మాండోవి (మహదాయి) నది ధారవాడ మీదుగా బెళగావి నుంచి గోవా రాష్ట్రం వైపు మహదాయి నది ప్రవహిస్తుంది. గోవా రాష్ట్ర ప్రజలందరికీ ఇదే ఏకైక తాగునీటి వనరు. హుబ్బళ్లి - ధారవాడతోపాటు బెళగావి, గదగ్, బాగల్కోటె జిల్లాలోని 11 పట్టణాలకు తాగునీటి కోసం నవలగుంద, నరగుంద కేంద్రాలుగా దశాబ్దాలపాటు పోరాటాలు సాగాయి. తాగునీటి అవసరాల కోసం మహదాయి నదికి అనుబంధంగా కళసా-బండూరి కాలువలను ఏకం చేసే ప్రాజెక్టు పనులకు మరో అడుగు మాత్రమే మిగిలి ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రజాప్రతినిధులు రాజకీయాలను వీడి ప్రయత్నాలు జరిపితే నాలుగు దశాబ్దాల కల నెరవేరుతుంది. అటవీశాఖ, పర్యావరణ శాఖలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. కళశ, అరతాళ, సులార్ మార్గంలో పులుల అభయారణ్యం ఉన్నందున కేంద్ర వన్యజీవి మండలి అనుమతులు అవసరమయ్యాయి. ఇప్పటికే కర్ణాటక నీరావరి మండలి, కళసా-బండూరి పరిధిలో పైప్‌లైన్‌ల ద్వారా నీటిని లిఫ్ట్ చేసేందుకు అండర్‌లైన్‌గా విద్యుత్‌లైన్‌ను అమర్చాల్సి ఉంటుంది. అరణ్య ప్రదేశం ఎంత అవసరమనేది గుర్తించాల్సి ఉంది. బండూరి కాలువ నుంచి మలప్రభ నదికి నీరు ఎత్తిపోతలకు సుమారు 17 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ అమర్చాల్సి ఉంటుంది. ఈ ప్రదేశంలో ఎన్ని చెట్లు తొలగించాల్సి వస్తుందనేది ఏఐటీయూ కంపెనీ సర్వే చేసి నివేదిక సిద్ధం చేసింది. వీటి ఆధారంగా బెళగావి జిల్లా ఖానపురలోని కర్ణాటక నీరావరి మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ ఏఏ ప్రాంతాల్లో అడ్డుగోడలు నిర్మించాలి, ఎక్కడి నుంచి నీటిని లిఫ్ట్ చేయాలనేది సర్వే చేశారు. ఏ ప్రాంతంలో పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలి, మలప్రభ నదికి నీరు ఏ విధంగా విడుదల చేయాలనేది బ్లూప్రింట్ తయారు చేశారు. రాష్ట్రబడ్జెట్‌లో గతంలోనే వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఆధారంగా టెండర్లు కూడా పిలిచారు. కళసా-బండూరి ప్రాజెక్టుకు గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు కంపెనీలు టెండర్లు వేశాయి. కేంద్ర వన్యజీవిమండలి అనుమతులు ఇచ్చిన వెంటనే టెండరు పొందినవారు పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని కర్ణాటక జలమండలి ఇంజనీర్లు చెబుతున్నారు.

ఇక్కడ రాజకీయాలే కీలకం

బెళగావి జిల్లా భీమగడ పశ్చిమ కనుమలలో పుట్టే మాండోవి (మహదాయి నది) సుమారు 80 కిలోమీటర్ల ప్రవహిస్తుంది. ఇందులో కర్ణాటకలో 29 కిలోమీటర్లు, గోవాలో 52 కిలోమీటర్లు దాకా ఉంది. ఈ నది ద్వారా ప్రవహించే 200 టీఎంసీల నీరు అరేబియా సముద్రంలోకి చేరుతుంది. ఇంత భారీస్థాయిలో నీరు సముద్రంలో చేరుతున్నా తాగునీటి కోసం 3.90 టీఎంసీల నీరు ఉపయోగించుకుంటే ఎక్కడా నష్టం ఉండదు. కానీ 40 ఏళ్లుగా కొనసాగిన అంతర్రాష్ట్ర జలవివాదం, న్యాయపోరాటం పరిశీలిస్తే రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ కారణాల కోసమే జాప్యం చేసినట్టు స్పష్టమవుతోంది.

నీటి కేటాయింపులు

2018 ఆగస్టు 14న మహదాయి జలవివాదంపై ట్రిబ్యునల్ తీర్పులో కర్ణాటకకు 13.5 టీఎంసీల నీటిని కేటాయించారు. ఇందులో తాగేందుకు 5.5 టీఎంసీలు, విద్యుత్ ఉత్పత్తికి 8.2 టీఎంసీలను వినియోగించుకునేలా తీర్పులో స్పష్టం చేశారు. కళశ ప్రాజెక్టు నుంచి 1.12 టీఎంసీలు, బండూరి కాలువ నుంచి 2.18 టీఎంసీల నీటితో కలిపి 3.9 టీఎంసీల నీటిని మలప్రభ ప్రాజెక్టుకు మళ్లించేలా సూచించారు.

ప్రాజెక్టు వివరాలు

హుబ్బళ్లి - ధారవాడలో 12.30 లక్షల మందికి, గదగ్, బాగల్కోటె, ధారవాడ, బెళగావి జిల్లాల పరిధిలో 11 పట్టణాలకు తాగునీరు లభించనుంది. పాత ప్రాజెక్టు ప్రకారం 258 హెక్టార్ల అటవీభూమి అవసరంగా ఉంది. కొత్త ప్రాజెక్టు ప్రకారం కేవలం 26.92 హెక్టార్ల అటవీభూమి వినియోగించనున్నారు. గతంలో రూ. 1177.22 కోట్లతో అంచనా వేయగా ప్రస్తుత అంచనా రూ.995.30 కోట్లుగా ఉంది.

మహదాయి సాగిన విధానం

- 1978లో మహదాయి ప్రాజెక్టు సిద్ధమైంది.
- 1980లో ఎస్ఆర్ బొమ్మై కమిషన్ నుంచి ప్రాజెక్టు అమలుకు సలహా ఇచ్చారు.
- 1988లో కర్ణాటక ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. గోవా ప్రభుత్వం వ్యతిరేకించి అభ్యంతరం తెలిపింది.
- 1989లో సీఎంగా ఉన్న ఎస్ఆర్ బొమ్మై అప్పటి గోవా ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ రాణెతో కలిసి చర్చలు జరిపి 45 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు కోరారు.
- 2000 ఆగస్టులో బండూరి కాలువకు అంచనాల ప్రకారం రూ.49.20 కోట్లు, కళశా కాలువకు రూ.44.78 కోట్లకు పాలనాపరమైన అంగీకారం తెలిపారు.
- 2002లో కేంద్రం నుంచి అనుమతులు పొంది కర్ణాటక ప్రభుత్వం అమలుకు సిద్ధమైంది. కళశా-బండూరి నుంచి 7.56 టీఎంసీల నుంచి మలప్రభ నదికి మళ్లించే కర్ణాటక ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆ వెంటనే గోవా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది.
- 2002 జూలై 9న ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్ర జలవనరులశాఖ మంత్రికి గోవా ప్రభుత్వం లేఖ పంపింది. సెప్టెంబరు 19న ప్రాజెక్టు అమలుకు కేంద్ర జల కమిషన్ సూత్రప్రాయంగా అంగీకరించిన అంశాలకు తాత్కాలికంగా నిలుపుదల చేసింది.
- 2006 సెప్టెంబరు 22న అప్పటి ఉపముఖ్యమంత్రి యడియూరప్ప జలవనరులశాఖ మంత్రి ఈశ్వరప్ప బెళగావి జిల్లా కణకుంబెలో భూమిపూజ చేశారు.
- 2010లో మహదాయి జల వివాదానికి ట్రిబ్యునల్ ఏర్పాటైంది.
- 2018లో మహదాయి జల వివాదానికి ట్రిబ్యునల్ కర్ణాటకకు 13.5 టీఎంసీల నీటిని కేటాయిస్తూ తీర్పును ప్రకటించింది.



ప్రధాని మోదీకి వినతి పత్రం ఇస్తున్న సీఎం, డీసీఎం తదితరులు

జలవనరుల ప్రాజెక్టులకు సహకరించండి

- మేకెదాటు, భద్ర ఎగువ ప్రాజెక్టు, కళసా-బండూరికి నిధులు విడుదల చేయండి
- మెట్రో, సొరంగ మార్గ నిర్మాణం సహా పలు సమస్యలపై ప్రధానికి సీఎం వినతి

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించిన జలవనరుల ప్రాజెక్టుల పూర్తి కావడానికి కేంద్రం నుంచి సంపూర్ణంగా సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కోరారు. శనివారం రాత్రి ఢిల్లీలో ప్రధానమంత్రి మోదీని సీఎం సిద్దరామయ్య ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల అంశాన్ని ప్రస్తావించారు. బెంగళూరు నగరానికి శాశ్వతంగా తాగునీటిని సమకూర్చుకోవడంతోపాటు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే మేకెదాటు ప్రాజెక్టుకు రూ.9వేల కోట్లతో డీపీఆర్ కేంద్ర జలకమిషన్ వద్ద పెండింగ్‌లో ఉందని వివరించారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్ 2023-24లో ప్రకటించిన రూ.5,300 కోట్లు విడుదల చేయాలని, కళసా - బండూరి తాగునీటి ప్రాజెక్టుకు జలశక్తి మంత్రిత్వ కార్యాలయం, అటవీశాఖల నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 60 కిలోమీటర్ల సొరంగ మార్గం నిర్మించేందుకు రూ.3వేల కోట్లు ఖర్చు కానుందని, జాతీయ రహదారి 7ను ఎన్‌హెచ్4కు అనుసంధానం చేసే పనులను అమలు చేయాలని విన్నవించారు. బెంగళూరు మెట్రో రైలు మూడో విడత 44.65 కిలోమీటర్ల నిర్మాణానికి రూ. 15,611 కోట్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. 8 లేన్‌ల పెరిఫెరల్ రింగ్‌రోడ్డును పీపీపీ పద్ధతిన నిర్మించదలిచామని కేంద్ర బడ్జెట్‌లో సహకరించాలని కోరారు. 15వ ఫైనాన్స్ కమిషన్ 2021-26కు చెరువుల అభివృద్ధికి పెరిఫెరల్ రింగ్‌రోడ్డుకు సిఫారసు చేసిన రూ.6వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. బీబీఎంపీలో సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్‌కు రూ.960 కోట్లు, కల్యాణ కర్ణాటకలో ఏడు జిల్లాల సమగ్ర అభివృద్ధికి రూ.3వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు. రాయచూరులో ఎయిమ్స్‌ను ప్రకటించాలని, 15వ ఫైనాన్స్ కమిషన్‌లో 2020-21లో సిఫారసు చేసిన రూ. 5,495 కోట్ల నిర్దిష్టమైన గ్రాంటును కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అంగీకరించలేదన్నారు. పన్నుల వాటాలో కర్ణాటకకు భారీగా నష్టం జరిగిందని, ఈ సిఫారసులకు సంబంధించి గ్రాంట్లను విడుదల చేయాలని కోరారు. ప్రధానమంత్రికి పుష్పగుచ్ఛం అందించిన సీఎం సిద్దరామయ్య అనంతరం ప్రత్యేకపూలమాలతో సత్కరించి, మైసూరు అంబారీ రూపంలోని నమూనాను బహూకరించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు పరమేశ్వర్, మహదేవప్ప తదితరులు ఉన్నారు.

2028లో నేనూ సీఎం రేసులో ఉంటా

- ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళి



బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అంతా సమైక్యంగా ఉన్నామనేలా కనిపించిన కాంగ్రెస్ నాయకుల మధ్య ఇటీవల విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయి. ఎవరికివారుగా చేస్తున్న వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి. తాజాగా శనివారం చిక్కోడిలో ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి మీడియాతో సరికొత్త కొత్తబాంబు పేల్చారు. ముఖ్యమంత్రి మార్పు విషయమై స్వామిజీలు కూడా చర్చలకు దిగారని అన్నారు. 2028లో తాను కూడా ముఖ్యమంత్రి పదవి కోసం డిమాండ్ చేస్తానని అన్నారు. పరోక్షంగా సీఎం పదవిపై ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్‌కు పోటీ అనే సందేశం ఇచ్చారు. 2028లో శాసనసభ ఎన్నికల తర్వాత అప్పటి ఫలితాలనుబట్టి తాను ముఖ్యమంత్రి కావాలని కోరతా అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి మార్పు అనేది ముగిసిన అధ్యాయమన్నారు. నాయకత్వ మార్పు అధిష్టానం తీర్మానిస్తుందని, డీసీఎంల అంశం కూడా అధిష్టానమే నిర్ణయిస్తుందన్నారు. ఇటీవల విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన మఠం మఠాధిపతి చంద్రశేఖరస్వామిజీ ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్దరామయ్య తప్పుకుని డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాజాగా వీరశైవలింగాయత సామాజిక వర్గం నుంచి పంచపీఠం శ్రీశైలమఠాధిపతి జగద్గురు డాక్టర్ చిన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్యతోపాటు బాళెహొన్నూరు రంభాపురిమఠం డాక్టర్ వీర సోమేశ్వర జగద్గురు లింగాయతలకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని లేనిపక్షంలో కనీసం డీసీఎం అయినా ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో సతీశ్ జార్కిహొళి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

పోలీసులపై దుండగుల దాడి

రాయచూరు, జూన్ 29 : పలు కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న కొందరు దుండగులు పోలీసులు తమను పట్టుకుంటారన్న భయంతో సినీ ఫక్కీలో దాడి చేసి తప్పించుకునే ప్రయత్నం చేసిన సంఘటన శనివారం జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రధాన సర్కిల్ వద్ద దుండగులు ప్రయాణిస్తున్న కారును పట్టుకునేందుకు పోలీసులు వెంబడించగా పోలీసు వాహనాన్ని ఢీకొట్టి తమ వద్ద ఉన్న కారంపొడి చల్లి చాకు, రాడ్లతో దాడి చేశారు. గమనించిన పోలీసులకు స్థానికులు సహకరించగా ఐదుగురు నిందితుల్లో ముగ్గురు గురురాజ్ సురేశ్ చవ్హాణ్ యాదగిరి, కుమార్ యమనప్ప చవ్హాణ్ కన్యాకోళూరు తండా, సురేశ్ ఫూలసింగ్ రాథోడ్ జినకేరితండాను అదుపులోకి తీసుకున్నారు. తిప్పణ్ణ చందప్ప రాథోడ్, మానప్ప ఓం రాథోడ్ కన్యాకోళూరు తండా పరారయ్యారు. దుండగుల దాడిలో కొంత మంది కానిస్టేబుళ్లు, స్థానికులకు గాయాలు కాగా వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ రత్నమ్మకు కానిస్టేబుళ్లు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి గాయపడిన కానిస్టేబుళ్లను, స్థానికులను పరామర్శించారు. పట్టుబడిన నిందితుల సహాయంతో పరారైన నిందితులను అరెస్టు చేస్తామని అడిషనల్ ఎస్పీ ప్రకటించారు.





ధ్వంసమైన పోలీసు వాహనం , పట్టుబడిన నిందితులు

ఉత్తర కర్ణాటక అభివృద్ధికి రాష్ట్ర విభజన అనివార్యం

- మరో వివాదానికి తెరలేపిన చంద్రశేఖర స్వామిజీ



చంద్రశేఖరస్వామిజీ

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విశ్వ ఒక్కలిగ మహా సంస్థానం మఠాధిపతి చంద్రశేఖరస్వామిజీ రెండు రోజుల వ్యవధిలో మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కెంపేగౌడ జయంతిలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సభలో ఉండగానే సీఎం పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మరింతమంది డీసీఎం పదవులకు అవకాశం కల్పించాలనే డిమాండ్ సాగుతున్న తరుణంలో స్వామిజీ వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వివాదంపై శనివారం ఓ మీడియాతో మాట్లాడిన సందర్భంలోనే చంద్రశేఖర్‌స్వామిజీ ఉత్తర కర్ణాటక అభివృద్ధి జరగాలంటే రాష్ట్ర విభజన జరగాల్సిందే అన్నారు. కర్ణాటకను ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటకగా విభజన చేయాలని కోరారు. అప్పుడే వెనుకబడిన ఉత్తర కర్ణాటకలో అభివృద్ధి పనులు సాధ్యమవుతాయని అన్నారు. ఉత్తర కర్ణాటకను ప్రత్యేక రాష్ట్రం చేయాలని పలుమార్లు డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఉమేశ్‌కత్తి వ్యాఖ్యలను గుర్తు చేశారు. రాష్ట్రాన్ని విభజించాలని డిమాండ్ చేసే స్వామిజీ బెంగళూరు విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరించారు. బెంగళూరు నగరాన్ని విభజన చేయరాదని అన్నారు. కెంపేగౌడ అంటే బెంగళూరు అని, ఓ మంచి నగరం కావాలనే కెంపేగౌడ ఆశయాన్ని పాడుచేయరాదని పేర్కొన్నారు. పాలన, లేదా ఇతర కారణాలు చూపి బెంగళూరు విభజన సరికాదన్నారు. ఇదే సందర్భంలోనే ముఖ్యమంత్రి పదవిని సిద్దరామయ్య వదులుకుని డీకే శివకుమార్‌కు అప్పగించాలన్న ఆయన ప్రతిపాదనను సమర్థించుకున్నారు. తాను డీకే శివకుమార్ కష్టం చూశానని, రాష్ట్రంలో 135 మంది ఎమ్మెల్యేల విజయం వెనుక ఆయన కష్టం ఉందని తెలిపారు. పార్టీ కోసం ఎవరు కష్టపడ్డారో వారికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం సముచితం అన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనేది తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.



రాహుల్‌గాంధీతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరుల బృందం

రాహుల్‌ను అభినందించిన ముఖ్యమంత్రి

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్షనేతగా ఎంపికైన రాహుల్‌గాంధీని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభినందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం, మంత్రులతోకలసి శనివారం రాహుల్‌గాంధీ నివాసానికి వెళ్లారు. రాహుల్‌గాంధీని ప్రత్యేకంగా అభినందించారు. మంత్రులు జార్జ్, పరమేశ్వర్, మహదేవప్ప, ఢిల్లీలో అధికార ప్రతినిధి టీబీ జయచంద్ర, ఎమ్మెల్సీ యతీంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా కేంద్ర హోంశాఖ మంత్రిగా మరోసారి బాధ్యతలు చేపట్టిన అమిత్‌షాను మర్యాద పూర్వకంగా భేటీ అయి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సంప్రదాయ మైసూరు పేటా, శాలువాతో సత్కరించారు. ఆస్ట్రేలియాలో కామన్వెల్త్ గేమ్స్ యునైటెడ్ మాస్టర్స్ వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారుపతకం సాధించిన ఖుద్సియా నజీర్‌ను అభినందించారు. ఆమె కోలారు జిల్లా బంగారపేటకు చెందిన కేఎస్ఆర్టీసీ ఉద్యోగిగా ఉన్నారు.



కేంద్ర హోం మంత్రిని సత్కరిస్తున్న సీఎం

హుబ్బళ్లి - ధారవాడ పాలికె బీజేపీ కైవసం

- మేయర్‌గా రామణ్ణ, డిప్యూటీ మేయర్‌గా దుర్గమ్మ ఎన్నిక

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్లి - ధారవాడ మహానగర పాలికె మేయర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. కొత్త మేయర్‌గా రామణ్ణ బడిగేర, డిప్యూటీ మేయర్‌గా దుర్గమ్మ బిజవాడ ఎన్నికయ్యారు. మేయర్ కోసం పోటీ చేసిన రామణ్ణ బడిగేరకు 47 ఓట్లు దక్కగా కాంగ్రెస్‌కు చెందిన ఇమామ్ ఎలిగారకు 36 ఓట్లు వచ్చాయి. ముగ్గురు కార్పొరేటర్లు తటస్థం కాగా నలుగురు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. ఉపమేయర్ దుర్గమ్మకు 47, కాంగ్రెస్ అభ్యర్థి మంగళమ్మ హిరేమణికి 36 ఓట్లు దక్కాయి. మేయర్ స్థానం బీసీలకు, డిప్యూటీ మేయర్ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. బెళగావి ప్రాంతీయ కమిషనర్ సంజయ్‌శెట్టణ్ణ నేతృత్వంలో శనివారం ఎన్నిక జరిగింది. 23వ సారి బీజేపీ మేయర్ స్థానాన్ని దక్కించుకుంది. మేయర్, డిప్యూటీ మేయర్‌ను కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ప్రత్యేకంగా అభినందించారు.



మేయర్, డిప్యూటీ మేయర్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కె.శే. శంకరనారాయణ కాంప్...

దాదాబాయ్ నౌరోజీ (వర్ధంతి)



'గ్రాండ్ ఓల్డ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన సర్ దాదాబాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4న నవశ్రీ పట్టణంలో జన్మించారు. భారత అనధికార రాయబారిగా గుర్తింపు పొందారు. పార్సీ స్కాలర్, వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు, లిబరల్ పార్టీ నుంచి ఎంపీగా యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ కామన్స్‌కు 1892 నుంచి 1895వరకు వ్యవహరించారు. బ్రిటీష్ ఎంపీ అయిన తొలి ఆసియా ఖండవాసి. కాంగ్రెస్‌పార్టీ సంస్థాపకులలో ఒకరు. 1917 జూన్ 30న కన్నుమూశారు.

జేవీ సోమయాజులు (జయంతి)



తెలుగు ప్రేక్షకుల హృదయాలలో 'శంకరాభరణం' శాస్త్రిగా పేరొందిన జొన్నలగడ్డ వెంకట (జేవీ) సోమయాజులు 1928 జూన్ 30న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. రంగ స్థలం, వెండితెర, బుల్లితెర అన్నింటిలోనూ నటించారు. సోదరుడు రమణమూర్తితో కలసి 'కన్యాశుల్కం' నాటకాన్ని 45ఏళ్లలో 500కుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో 'రామప్పపంతులు' పాత్రతో పేరొందారు. అనంతరం బుల్లితెరపై 'కన్యా శుల్కం' నాటకాన్ని 13భాగాలుగా రూపొందించారు. జంట నగరాలలో నాటకకళ ప్రోత్సాహానికి 'రసరంజని' సంస్థను స్థాపించారు. సాంస్కృతిక విభాగంలో డైరెక్టర్‌గా పనిచేశారు. 2004 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

కల్యాణ్‌జీ (జయంతి)



ప్రముఖ సంగీతద్వయం కల్యాణ్‌జీ-ఆన్ందజీ సోదరులలో కళ్యాణ్‌జీ విర్జిషా ఒకరు. 1928 జూన్ 30న గుజరాత్ రాష్ట్రం కచ్ ప్రాంతం కుద్రోడిలో జన్మించారు. నాలుగు దశాబ్దాలలో 250కు పైగా హిందీ సినిమాలకు సోదరులిద్దరూ సంగీతంలో తమదైన ముద్రను చాటారు. అందులో 17 గోల్డెన్‌జుబ్లీ సాధించగా 39 సిల్వర్ జుబ్లీలు ఉన్నాయి. 1968లో సరస్వతీ చంద్ర జాతీయ పురస్కారం పొందారు. 1975లో ఉత్తమ సంగీత దర్శకుడిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారాన్ని 'కోరా కాగజ్'కు అందుకున్నారు. 'పద్మశ్రీ'తోపాటు ఎన్నో అవార్డులు పొందారు. 2000 ఆగస్టు 24న కల్యాణ్ జీ కన్నుమూశారు.

పప్పు వేణుగోపాలరావు (జయంతి)



డాక్టర్ పప్పు వేణుగోపాలరావు 1948 జూన్ 30న విజయనగరం జిల్లా బొబ్బిలిలో జన్మించారు. విద్యావేత్త, సంగీతంపై శాస్త్రీయ పరిశోధనలు చేశారు. తెలుగు, సంస్కృత సాహిత్యంలో రాణించారు. సంగీతం, నృత్యం, సంస్కృతి, ఆధ్యాత్మికతపై 20 పుస్తకాలు రాశారు. దాశరథి శతకాన్ని ఆంగ్లంలోకి అనువదించగా పొట్టిశ్రీరాములు యూనివర్శిటీ ప్రచురించింది. ప్రపంచ తొలి యానిమేషన్ రామాయణ సీడీకి ఆయన స్క్రిప్ట్ రాశారు. నాట్యశాస్త్రంపై ఎన్నో ప్రసంగాలు చేశారు. కళావిపంచి, సంగీతశాస్త్ర విశారద, సంగీత శాస్త్రనిధి, అష్టావధాన శేఖర తదితర బిరుదులు పొందారు. 2024 ఏప్రిల్ 7న కన్నుమూశారు.

డాక్టర్ సీఎన్ఆర్ రావు (పుట్టినరోజు)



ప్రముఖ శాస్త్రవేత్త 'భారతరత్న' గ్రహీత చింతామణి నాగేశ రామచంద్రరావు (సీఎన్ఆర్ రావు) 1934 జూన్ 30న బెంగళూరులో జన్మించారు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీలో 1,770 పరిశోధనా వ్యాసాలు, 53 పుస్తకాలు రచించారు. 24 ఏట పీహెచ్‌డీ అందు కున్నారు. ప్రపంచవ్యాప్తంగా 83యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. కర్ణాటక రత్న, ఇండియన్ సైన్స్ అవార్డులు అందుకున్నారు. సీవీ రామన్, అబ్దుల్ కలాంల తర్వాత 'భారతరత్న' అందుకున్న శాస్త్రవేత్త ఆయనే. 'జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్' సంస్థాపకులు. ప్రధానమంత్రి సైంటిఫిక్ అడ్వైజరీ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా 1985 నుంచి 89మధ్య, 2005 నుంచి 2014 వరకు వ్యవహరించారు. 'పద్మశ్రీ', పద్మవిభూషణ్ తదితర పురస్కారాలు అందుకున్నారు.

సనత్ జయసూర్య (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ సనత్ తేరన్ జయసూర్య 1969 జూన్ 30న జన్మించారు. శ్రీలంక క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గానే కాక ఆల్ రౌండర్‌గా సత్తా చాటు కున్నారు. బ్యాటింగ్‌లో రాణించి జట్టుకు ఎన్నో విజయాలు అందించారు. వన్డేలలో 10వేల పరుగులు, 300కుపైగా వికెట్లు సాధించి తనదైన రికార్డు నెలకొల్పారు. ఐసీసీ వరల్డ్ ట్వంటీ -20లో 2014లో శ్రీలంక విజయానికి ఆయనే సారథ్యం వహించారు. 48సార్లు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 11సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' గుర్తింపు పొందారు. తనకెరీర్‌లో 15వేలకుపైగా పరుగులు, 400కుపైగా వికెట్‌లతో 'లిస్ట్ ఏ క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా నిలిచారు.

మైఖేల్ ఫెల్ప్స్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన ప్రముఖ ఈతగాడు మైఖేల్ ఫ్రెడ్ ఫెల్ప్స్-2 1985 జూన్ 30న జన్మించారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించా రు. 23 ఒలింపిక్ గోల్డ్‌మెడల్స్‌తో ఆల్-టైమ్ రికార్డు సాధించారు. ఇంటర్నేషనల్ లాంగ్‌కోర్సు కాంపిటీషన్స్‌లో 65 బంగారు, 14 రజత, 3 కాంస్యపతకాలు సాధించారు. వరల్డ్ చాంపియన్‌షిప్స్, పాన్ పసిఫిక్ చాంపియన్ షిప్స్ తదితర పోటీలలో భాగస్వామ్యులయ్యారు. వరల్డ్ స్విమ్మర్ ఆఫ్ ఇయర్ 8సార్లు, అమెరికన్ స్విమ్మర్ ఆఫ్ ఇయర్ అవార్డు 11సార్లు అందుకున్నారు. ఫినా స్విమ్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును 2012, 2016లో అందుకున్నారు. సొంతంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈత సహా పలు ఆరోగ్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

ఉద్యోగాలు కాదు.. స్టార్టప్‌లు లక్ష్యం కావాలి

▸▸ ఏఎంసీ స్నాతకోత్సవంలో ఇస్రో మాజీ చైర్మన్ శివన్



స్నాతకోత్సవంలో ఇస్రో మాజీ చైర్మన్ శివన్ తదితరులు

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాల కోసం ప్రాకులాడకుండా సొంతంగా స్టార్టప్‌ల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకోవాలని ఇస్రో మాజీ చైర్మన్ శివన్ పిలుపునిచ్చారు. బన్నేరుఘట్టరోడ్డులోని ఏఎంసీ కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవ సమావేశానికి చైర్మన్ పరమహంస అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రెండు దశాబ్దాలకాలంలో దేశీయ సాంకేతిక పరిజ్ఞానంలో చారిత్రాత్మక విప్లవం సాధ్యమైందన్నారు. బెంగళూరు ఎన్నింటికో రాజధాని అన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులకు విపులమైన అవకాశాలు ఉన్నాయన్నారు. దేశానికే స్టార్టప్ రాజధాని బెంగళూరు అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు, పరిశోధనలు స్టార్టప్‌లవైపు సాంకేతికంగా ఎన్నో ఆవిష్కరణలకు అవకాశాలు ఉన్నాయ న్నారు. ఇస్రో ద్వారా గగనయాన 400 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లే అంతరిక్షయానం ఆరంభమవుతోందన్నారు. 2035 నాటికి ఇస్రో నుంచి స్పేస్ స్టేషన్, 2040 నాటికి మన శాస్త్రవేత్తలు అంతరిక్షంలో దిగి పరిశోధనలు చేసేలాంటి ప్రాజెక్టులను తీసుకొస్తున్నారన్నారు. ఇటువంటి సాధనలు సాధించాలంటే యువత సహకారం అవసరమన్నారు. విద్యార్థులు దేశం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. క్రేజీ ఐడియాలకోసం ఆలోచించాలని, నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఇస్రో ప్రొఫెసర్ డాక్టర్ పీజీ దివాకర్ మాట్లాడుతూ ఇస్రో రూపొందిస్తున్న ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఇలు, ఇంకుబేషన్ సెంటర్‌ల ద్వారానే అవకాశాలు పెరుగు తున్నాయన్నారు. స్నాతకోత్సవంలో 800మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గీతా పరమహంస, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కల్లూరి, అకడమిక్ అడ్వైజర్ డీఆర్ నాగరాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే కుమార్‌లు పాల్గొన్నారు.


మలె మహదేశ్వర హుండీ ఆదాయం రూ.2 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మలె మహదేశ్వర ఆలయంలో నెల రోజుల్లో 2 కోట్ల రూపాయలు హుండీ ద్వారా ఆదాయం వచ్చింది. శుక్రవారం హుండీల లెక్కింపు చేపట్టగా రూ.2.20 కోట్ల ఆదాయం వచ్చినట్టు మహదేశ్వర ఆలయ అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి రఘు తెలిపారు. కొండపై బస్టాండ్ సమీపంలోని కమర్షియల్ కాంప్లెక్స్‌లో సాలూరు బృహన్‌మఠం అధ్యక్షులు శాంత మల్లికార్జున స్వామి నేతృత్వంలో లెక్కింపు నిర్వహించారు. రూ.2,20,97,533 నగదుతోపాటు 106 గ్రాముల బంగారం, వెండి వస్తువులు కానుకల రూపంలో వచ్చాయన్నారు. ఇ-హుండి ద్వారా 3,38,830 రూపాయలు వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీలలో 3 డాలర్‌లు, అరబ్ 1, నేపాలి 1, ఒమన్ దేశానికి చెందిన ఒక కరెన్సీనోటు వచ్చిందన్నారు. కాగా చెల్లుబాటు కాని 2వేల రూపాయలనోట్లు 19 వచ్చినట్టు తెలిపారు.

గూగుల్ ట్రాన్స్‌లేటర్‌లో తుళు భాష చేరిక



బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తుళు భాషను విశ్వవ్యాప్తంగా విస్తారం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. తాజాగా గుగూల్ ట్రాన్స్‌లేటర్‌లోనూ ఇతర భాషల నుంచి తుళభాష అర్థాలను సులభంగా తెలుసుకునే వీలుంది. ఇది తుళు భాష మాట్లాడేవారు సంబరపడే అంశమని కర్ణాటక తుళు సాహిత్య అకాడమీ అధ్యక్షులు తారానాథ్ గట్టికాపికాడ్ తెలిపారు. గూగుల్ ట్రాన్స్‌లేటర్‌లో తుళు భాష చేరిక ద్వారా కర్ణాటకలోని తీరప్రాంత జిల్లాల్లో పర్యాటకులు తుళు భాషను సులభంగా అర్థం చేసుకునేందుకు వీలుంటుంది. కొన్ని సందర్భాలలో పదాలు తప్పుగా ఉచ్చరించడం, సాధారణ అంశం. ఇటువంటి సందర్భంలో ఫీడ్‌బ్యాక్ కాలమ్‌లో సమగ్ర పదాన్ని పొందుపరిచే వీలుంటుంది. గూగుల్ ట్రాన్స్‌లేట్‌లో తుళుభాష చేరడం ద్వారా తుళు మాట్లాడేవారితోపాటు ఇతర భాషలవారికి మరింత వీలు కానుంది. ద్రవిడభాషలలో ఒక్కటైన తుళు ఉత్తరకన్నడ, ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాలతోపాటు చిక్కమగళూరులోని కొన్ని ప్రాంతాలు, సరిహద్దులోని కేరళ రాష్ట్రంలోని ఉత్తరభాగంలో భాష మాట్లాడతారు. శ్రీకృష్ణదేవరాయలు మాతృభాష కూడా తుళు కావడం ప్రత్యేకం. దేశవ్యాప్తంగా తుళుభాషను 20లక్షలమంది మాతృభాషగా ఉన్నట్టు 2011 అంచనాలలో తేలింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సమారు 40 లక్షలమందిదాకా మాట్లాడుతున్నట్టు 2009లో అంచనా వేశారు. తమిళ, కన్నడలో లభించని అనేకమైన లక్షణాలు తుళుభాషకు ఉంది.

నర్సుల సంక్షేమానికి కృషి చేస్తాం

▸▸ జాతీయకార్యవర్గ అధ్యక్షుడు విజయ్‌కుమార్

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మజ్దూర్‌సంఘ్‌కు అనుబంధంగా భారతీయ నర్సులు, ఆరోగ్యరంగంలో వృత్తిపర సంఘాల జాతీయ కార్యవర్గ కమిటీ నర్సుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని ప్రకటించారు. ఈమేరకు జాతీయ అధ్యక్షులుగా కేకే విజయ్ కుమార్, సంచాలకులుగా బిజు థామస్, సహ సంచాలకులుగా అనిల్‌కుమార్, రాష్ట్ర సంచాలకులుగా శాంతాభాయ్‌లు ఎంపికయ్యారు. నగరంలో శనివారం విజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ దేశంతోపాటు అంతర్జాతీయస్థాయిలో పనిచేస్తున్న నర్సులు, ఆరోగ్యరంగంలో పనిచేస్తున్న అన్ని స్థాయిల సిబ్బందికి తమవంతు సహకారం అందిం చదలిచామన్నారు. నర్సులు, ఆరోగ్య కార్యకర్తలకు గౌరవం, వనరులు అర్హులకు లభించాల్సిన ఉద్యోగాలు వంటి అంశాలలో తమ మద్దతు ఉంటుందన్నారు. ఆరోగ్య, వృత్తిపర ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం ప్రత్యేక పాలసీలను తీసుకురాదలిచామన్నారు. ఇందు కోసం నర్సుల సంక్షేమసహాయ కేంద్రం ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా వారి సమస్యలను ప్రాంతాలవారీగా తెలుసుకుని మార్గదర్శకాలు చేస్తామన్నారు. నర్సులు సంఘంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నర్సింగ్ ఉద్యోగాల కోసం అంతర్జాతీయస్థాయిలో మార్గదర్శకాలు చేయదలిచామన్నారు. రాష్ట్ర సంచాలకులు శాంతాభాయి కట్టెమని మాట్లాడుతూ వివిధ దేశాలలో దక్షిణభారత్‌కు చెందిన నర్సులే అత్యధికంగా పనిచేస్తున్నారన్నారు. ఆరోగ్యరంగంలో కేరళ నర్సుల పాత్ర కీలకమన్నారు. కర్ణాటకలోనూ ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ జిల్లాల్లో ఎక్కువ మంది ఉన్నారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడతామన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి



కేతగానహళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సభ్యులు

బంగారపేట, జూన్ 29: తాలూకాలోని కేతగానహళ్ళి గ్రామపంచాయతీలో అధ్యక్షులు, పీడీఓలు కుమ్మక్కై నిధులను దుర్వినియోగం చేశారని, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని గ్రామపంచాయతీ సభ్యుడు శ్రీధర్ తీవ్ర ఆరోపణ చేశారు. గ్రామపంచాయతీ అక్రమాలపై శనివారం సభ్యులు శనివారం నిరసన చేపట్టారు. 15వ ఆర్థిక యాక్షన్‌ప్లాన్‌ను సభ్యుల దృష్టికి తేకుండా ఇష్టం వచ్చినట్టు నకిలీ బిల్లులతో లక్షలాది రూపాయలు ఖాతా లకు మళ్లించారని ఆరోపిం చారు. పీడీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో సరైన సమయానికి రావడం లేదని, వారానికి ఒక రోజు మాత్రమే విధులకు రావడంతో ఎటువంటి పనులు జరగడం లేదన్నారు. ఇ-ఖాతా పొందేం దుకు ప్రజలు ఇబ్బందులు పొందుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. కేతగానహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంజుళ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎటువంటి అక్రమాలు జరగ లేదన్నారు. తన అవధికి ముందు ఉన్న అధ్యక్ష, పీడీఓలు బిల్లులు పెం డింగ్‌లో ఉంచడంతో వాటిని తన అవధిలో క్లియర్ చేయా ల్సిన అనివార్యత ఏర్పడిందన్నారు. కొంతమంది సభ్యులు అశాస్త్రీయ బిల్లులను చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. అందుకు తాను స్పందించక పోవడంతో నిరసన చేస్తున్నా రని ఆరోపించారు. కాగా పీడీ ఆనంద్ మాట్లాడుతూ శనివా రం జరగాల్సిన సామాన్య సభ కోరం లేక వాయిదా వేసిన ట్టు తెలిపారు. ఆరోపణల్లో ఎటువంటి వాస్తవాలు లేవన్నా రు. ధర్నా స్థలానికి తాలూకా పంచాయతీ నోడల్ అధికారి యువరాజ్ విచ్చేసి ఆందోళన కారులను ఉద్దేశించి మాట్లాడుతూ వారం రోజుల్లోగా ప్రతి అంశాన్ని కూలంకుషంగా చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిరసనలో సభ్యులు నారాయణ స్వామి, నటరాజ్, రవి, అరుణ, రేణుకా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మంచి పేరు తెచ్చుకోండి



విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

బాగేపల్లి, జూన్ 29: పట్టణంలోని వికాస పీయూ, డిగ్రీ కళాశాలలో పీయూ, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ సంస్కారాన్ని అలవరచుకోవడం ద్వారా విద్యలోనూ, ఉద్యోగంలోనూ ఉన్నతస్థాయిలో రాణించాలని సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి మాట్లాడుతూ తమకు లభించిన అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంతోపాటు నైతిక విలువలతో ముందుకు సాగాలని అభిలషించారు. అలాగే మాదక ద్రవ్యాలు, ఇతర దుర్వ్యసనాలకు లోను కారాదని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ పీఎన్ శివణ్ణ మాట్లాడుతూ పాఠాలతోపాటు పాఠ్యేతర అంశాలలోనూ, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహించామని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు సభికులను అలరించాయి. కళాశాల పాలకమండలి సభ్యుడు బైయప్పరెడ్డి, వెంకటస్వామి, సుకేశ్, రవి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంతానలేమిపై ప్రత్యేక పరీక్షా శిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్య బృందం తదితరులు

చేళూరు, జూన్ 29: చేళూరులోని సాయి మారుతి హాస్పిటల్‌లో బెంగళూరుకు చెందిన ఐశ్వర్య ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో సంతానలేమిపై ప్రత్యేక పరీక్షా శిబిరం నిర్వహించారు. 80మంది దాకా గ్రామీణ మహిళలు పాల్గొని సలహా సూచనలు పొందారు. మారుతి ఆసుపత్రి డాక్టర్ మారుతినాయక్ నేతృత్వం వహించారు.

విద్యార్థుల కోసం వలంటీర్లుగా ఆబ్వి ఉద్యోగులు



పాఠశాలలో పాల్గొన్న ఉద్యోగుల బృందం

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ ఆబ్వి తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వీక్ ఆఫ్ పాజిబిలిటీస్ పేరిట విద్యార్థులకోసం వలంటీర్లుగా మారారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటు 50దేశాలలో సేవలు కొనసాగించినట్టు ఆబ్వి జనరల్ మేనేజర్ సురేశ్ పట్టిత్తల్ తెలిపారు. ఈమేరకు శనివారం బెంగళూరులో మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరులో స్థానికులకు సాయం చేసే దిశగా ఐ వలంటీర్ సంస్థతో కలసి కార్యక్రమాలు చేశామన్నారు. మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ ఉర్దూ పాఠశాలలో ఫాస్ట్ ఫ్యాషన్, జౌళి వృథాతో తలెత్తే సమస్యలపై విద్యార్థులకు వివరించామన్నారు. టీ షర్టులను సంచులుగా మార్చే అంశంపై శిక్షణలు ఇచ్చామన్నారు. విద్యార్థులతో కలసి ఒక రోజంతా ప్రకృతి, పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యులయ్యామన్నారు.

పోటెత్తిన భక్తులు

కిక్కిరిసిన ఖాద్రీశుడి ఆలయం



స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కదిరి, జూన్ 29: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజ స్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి..

రేపటి నుంచి ఉచిత ఆయుర్వేద శిబిరం



డాక్టర్ కిశోర్

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండియా ఆయుర్వేద ఫౌండేషన్, స్వస్థ సమృద్ధ భారత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జులై 1నుంచి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు డాక్టర్ సీపీ కిశోర్ తెలిపారు. శిబిరానికి సంబంధించి శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ జబ్బులకు సంబంధించి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జులై 8వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. 8050010100 నెంబరుకు సంప్రదించాలన్నారు. కనకపుర రోడ్డులోని యలచేనహళ్ళి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శాస్త్రి ఆయుర్ధామ ఆసుపత్రి ప్రాంగణంలో శిబిరం కొనసాగుతుందన్నారు.

ఐరిష్‌లో ఉన్నతవిద్యకై దేశవ్యాప్త క్యాంప్‌లు

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐరిష్‌లో ప్రతి ష్టాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లదలిచిన విద్యార్థుల సందేహాల నివృత్తికి దేశవ్యాప్తంగా క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. నేషనల్ కాలేజ్ ఆఫ్ ఐర్లాండ్, డబ్లింగ్ సిటీ యూనివర్శిటీ, టెక్నలాజికల్ యూనివర్సిటీ శానన్‌తోపాటు పలు యూనివర్సిటీలలో చేరదలిచినవారికోసం వన్ స్టెప్ గ్లోబల్ ద్వారా కార్యక్రమాలు జరుపుతున్నట్టు సీఎండీ అరిత్రో ఘోసల్ తెలిపారు. ఆదివారం బెంగళూరులో, జులై 3న ఢిల్లీ, 6న పూనె, 7న ముంబైలో ఏర్పాటు చేశామన్నారు. ఐరిష్ విశ్వ విద్యాలయాల ప్రతినిధులు ఎదుర్కొనే అన్ని సమస్యలపైనా అవగాహన కల్పిస్తారన్నారు. మనోజ్ యూనివర్సిటీ ప్రతినిధి ఏంజెలా మెక్నేనాతోపాటు వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

మద్దెమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి హారతి


చేళూరు, జూన్ 29: తాలూకాలోని చాకవేలు గ్రామంలో వెలసిన మద్దెమ్మ ఆలయ 21వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారికి, నాగదేవతలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆదివారం కూడా వార్షికోత్సవ పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి ప్రత్యేక అలంకరణ

శిడ్లఘట్ట, జూన్ 29: తాలూకాలోని బెళ్యాటిగేట్ సమీపాన వైకుంఠపురంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ రెండో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈనెల 24 నుంచి 28వరకు ఐదు రోజులపాటు ప్రతిరోజూ విశేషపూజా కార్యక్రమాలు కొనసాగాయి. అగ్ని హోమం, ఉయ్యాలసేవ, తోమాలసేవ ఇతర కైంకర్యాలు నిర్వహించారు. ప్రతిరోజూ అన్నసంతర్పణ కొనసాగింది. కాగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు మహామంగళారతి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తల కాయల బెట్టపై కొలువైన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, పట్టణంలోని వాసవి రోడ్డులోని స్వామివారి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.33	1,578.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	879	462
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	297	2,698
సామర్థ్యం (టీఎంసీలు)	5.15	3.71

మా సమస్యలను ఆలకించండి

● ఎమ్మెల్యేకు హాస్టల్ కార్మికుల వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న కార్మికులు

బళ్లారి సిటీ, జూన్ 29 : తమకు నేరుగా ప్రభుత్వం ద్వారానే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ హాస్టల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజయనగరం ఎమ్మెల్యే గవియప్పకు శనివారం వినతి పత్రం సమర్పించింది. పదవీ విరమణ వరకు సేవా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పదేళ్ళ సర్వీసుఉన్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ దినసరి వేతన సంక్షేమ చట్టం పరిధిలోకి తీసుకురావాలని, కార్మిక శాఖ కనీస వేతన సవరణ కమిటీ సమావేశమై కనీస వేతనం రూ.31వేలుగా నిర్ణయించిందని దాన్నిఅమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక శాఖ చట్టం ప్రకారం వారానికో సారి సెలవు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పదవీ విరమణ తర్వాత నిర్వహణ కోసం రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. వసతి గృహాల వార్డెన్‌లు వంట చేయడానికి అవసరమైన ఆహార పదార్థాలను సరైన పరిమాణంలో తీసుకురావాలన్నారు. కొత్తగా ప్రారంభించిన హాస్టళ్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మారడి జంబయ్యానాయక్, తాయప్పనాయక్, హనుమంతప్ప, రమేశ్, మంజునాథ్, రేణుకమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీ, ఎస్‌టీ గ్రాంట్‌ల సద్వినియోగం: డీసీ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, జూన్ 29: షెడ్యూల్డ్‌కులాలు(ఎస్‌సీఎస్‌పీ), షెడ్యూల్డ్ తెగల (టీఎస్‌పీ) గ్రాంట్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. నగరంలోని జిల్లా నూతన పాలనా భవనంలో శనివారం ఏర్పాటు చేసిన 2024-25 సంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్డ్ కులాలసబ్‌ప్లాన్, షెడ్యూల్డ్ తెగల సబ్‌ప్లాన్ ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. షెడ్యూల్డ్‌కులాలు, షెడ్యూల్డ్ తెగల గ్రాంట్లు వినియోగిస్తూ పురోగతిలో జాప్యం చేయరాదన్నారు. గ్రాంట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖల పరిదిలోని కార్యక్రమాల అమలు ప్రభావం, నాణ్యతపై సామాజిక సర్వే మూల్యాంకనం కూడా జరుగుతుందని ఆయన తెలియజేశారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆపనులు నాణ్యతతో ఉండాలన్నారు. తప్పు జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సిఉంటుందన్నారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మల్లికార్జున, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి దివాకర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల బండ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు



తోపుడు బండితో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

కంప్లి, జూన్ 29 : కంప్లి పట్టణం మారెమ్మగుడి సన్నాపురం వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా తోపుడు బండ్లపై కాయగూరలు విక్రయిస్తున్నందున రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలుగుతోంది. ఈ మార్గంలో వన్‌వే ఉండటంవల్ల ఈ కాయగూరలు విక్రయించేవారు తోపుడు బండ్లను రోడ్లపై వుంచి అమ్మకాలు చేస్తుండటంతో ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా మారుతోంది. ఈ విషయంపై ఎన్నోసార్లు పట్టణ పంచాయతీ పురసభ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీబీ బోర్డు టెండర్లంటే హడల్!



● నిలిచిపోయిన కోట్లాది రూపాయల బకాయిలు ● పనులు చేసి చేతులు కాల్చుకుంటున్న కాంట్రాక్టర్లు

● సింగిల్ టెండరు కారణంగా రీకాల్ చేస్తున్న అధికారులు ● ఈ ప్రభుత్వంలోనైనా బిల్లులివ్వాలని వేడుకోలు

బళ్లారి గాంధీనగర్, జూన్ 29:ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రజల ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్ర పరిధిలోని ఎగువ కుడి, దిగువ కుడి కాలువల ఆధునికీకరణ పనులు కుంటుబడ్డాయి. 2018 నుండి సుమారు కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేశారు. అనంతరం కుడి దిగువ (ఎల్లెల్సీ) కాలువ ఆధునీకరణ 10 ప్యాకేజీలతో ప్రారంభం కాగా నిధుల కొరత కారణంగా 2023 సంవత్సరంలో ఆ పనులు అరకొరగా నిలిచి పోయాయి. 250 కిలోమీటర్ల పొడవు ఉన్న ఎల్లెల్సీకి ఇప్పటి వరకు 115 కిలోమీటర్ల వరకు ఆధునీకరణ పనులు కాగా, అక్కడి నుండి అభివృద్ధి పనులు పూర్తిగా ఆగిపోయాయి. మూడేళ్ళుగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకు పోయాయి. దీంతో పనులు చేపట్టిన తమ పరిస్థితి దయనీయంగా మారినట్లు కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. రెండేళ్ళుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నిధులు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రతియేటా కాలువలకు నీళ్ళు వదిలే ముందు చేసే చిన్నపాటి పనులు కూడా చేపట్టలేని స్థితిలో టీబీ బోర్డు ఉంది. కాలువలకు సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో అభివృద్ధి పనులు చేయడం పరిపాటి. నిధులు వస్తాయన్న నమ్మకంతో గత ఏడాది పనులు పూర్తి చేయగా... బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ఏడాది హెచ్చెల్సీ, ఎల్లెల్సీ కాలువల నిర్వహణ కోసం సుమారు 150 పనులకు టెండర్లు పిలవగా చాలా పనులకు సింగిల్ టెండరు మాత్రమే దాఖలయింది. దీంతో మళ్ళీ వాటికి రీ కాల్ చేశారు. మరికొన్ని పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందు రాకపోవడంతో బోర్డు అధికారులు మళ్ళీ... మళ్ళీ ఏకంగా 5వ సారి కూడా టెండర్లు పిలిచే పరిస్థితి నెలకొంది. బోర్డు పరిధిలో ఇలాంటి గడ్డు కాలం వస్తుందని అనుకోలేదని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టెండర్ల సమయంలో కొంతమంది రింగ్‌గా ఏర్పడి పనులు దక్కించుకోవడానికి తలలు పగలుగొట్టుకున్న ఘటనలు లేకపోలేదు. ఈ - ప్రొక్యూర్‌మెంట్ వచ్చిన తరువాత పనుల్లో రింగ్ విధానం తగ్గిందని చెప్పవచ్చు. ఈ - ప్రొక్యూర్‌మెంట్ అమల్లోకి వచ్చిన తరువాత పనుల్లో పారదర్శకత ఉన్నా...నిధుల విడుదలలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా బోర్డు పనులు అంటేనే కాంట్రాక్టర్లు వెనక్కు వెళ్లే పరిస్థితి నెలకొంది. జగన్ ప్రభుత్వంలో నిలిచిపోయిన కోట్లాది రూపాయల బకాయిలను ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వంలోనయినా చెల్లించేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే కాంట్రాక్టర్ల పరిస్థితి పూర్తిగా విషమంగా మారే పరిస్థితి ఏర్పడిందని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం



జన జాగృతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జూన్ 29 :మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకమని తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో వీకేజేజే కళాశాల విద్యార్థులు, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం జన జాగృతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా వుండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ముందుకు రావాలంటే శ్రద్ధగా చదువుకోవాలన్నారు.

ఇకపై గ్రామ పంచాయతీలోనే జనన, మరణాల నమోదు

బళ్లారి సిటీ, జూన్ 29: జిల్లాలోని గ్రామపంచాయితీల్లో జూలై నెల నుంచి గ్రామపంచాయితీ కార్యదర్శి ఆధ్వర్యంలో జనన, మరణ నమోదు చేపట్టనున్నట్లు జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప తెలిపారు.గ్రామపంచాయితీ సెక్రటరీని డిప్యూటీ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ చట్టంలో సవరణలు చేశారన్నారు. పుట్టిన 30 రోజుల వరకు జననాలను నమోదు చేసుకోవచ్చునన్నారు. మరింత సమాచారం కోసం సంబంధిత పంచాయితీ కార్యదర్శిని సంప్రదించవచ్చన్నారు.

బీజేపీ నిరవధిక దీక్ష భగ్నం

● పార్టీ నాయకుల అరెస్ట్, విడుదల



శ్రీరాములును అరెస్టు చేసి వ్యాన్‌లో తీసుకెళుతున్న పోలీసులు

బళ్లారి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ సంక్షేమశాఖలో జరిగిన రూ.187కోట్ల అవినీతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు డీసీ కార్యాయంలో ఎదుట చేపట్టిన నిరవదిక సమ్మెను శనివారం పోలీసులు భగ్నం చేశారు. డీసీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేసిన అనంతరం మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు అనిల్‌నాయుడు మోకా, ఇతర నాయకులు వందలాది మందితో నిరవధిక దీక్ష చేపట్టారు. శనివారం 12గంటల తర్వాత ఎస్పీ రవికుమార్ ఇతర పోలీసులు వచ్చి శ్రీరాములుతో చర్చించారు. సమ్మెను విరమించాలని కోరారు. బీజేపీ నాయకులు వినకపోవడంతో దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేసి బ్రూస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. విడుదల అనంతరం మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన మంత్రి నాగేంద్రను అరెస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందరాజులు, పాలన్న, శ్రీనివాస్‌మోత్కార్ పాల్గొన్నారు.

న్యాయం లభించేంతవరకు నిరసన



559వ రోజు దీక్షాశిబిరంలో నిరసన తెలుపుతున్న రైతులు

కంప్లి, జూన్ 29 : ఫ్యాక్టరీల కోసం భూములు పోగొట్టుకున్న రైతులకు న్యాయం లభించే వరకు నిరసన దీక్ష ఆపేదిలేదని అరిగిణడోణి, జానెకుంటి, యర్రంగళి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం గ్రామాల రైతులు తెలిపారు. కుడితినిలో న్యాయం కోసం 559 రోజుల నుంచి నిరసనలు చేస్తున్నా ఇంతవరకు తమకు న్యాయం లభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయు, రైతు సంఘం పదాధికారులు, రక్షణ వేదిక పదాధికారులు బసవరాజు, సత్తిబాటు, తిప్పేస్వామి, శివశంకర్, జంగ్లిసాబ్, తిమ్మప్ప, సంపత్ బసవరాజు తదితరులు మాట్లాడుతూ పోరాటం ప్రారంభించి రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఏ నాయకుడు తమ వద్దకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తుకారామ్ ఎమ్మెల్యేగా వున్న సమయంలోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య శీతాకాల సమావేశాల్లో భూములపై చర్చించారని, అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదనవ్యక్తం చేశారు. అలాగే జేడీఎస్ పార్టీ నాయకులు కుమారస్వామి ఎన్నికల ప్రచారంలో తమకు న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారని కానీ ఇంతవరకు ఏ పార్టీ నాయకులు తమకు న్యాయం చేకూర్చలేదన్నారు.

పౌరాణిక నాటకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిరంజన్ ప్రభుస్వామి

కంప్లి, జూన్ 29 : గ్రామాల్లో పౌరాణిక నాటకాలకు యువకులు ప్రాధాన్యమివ్వాలని నిరంజన్ ప్రభు మహాస్వాములు తెలిపారు. శుక్రవారం రాత్రి కురుగోడు పట్టణంలో కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ముంగారు సాంస్కృతిక రంగోత్సవ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉలగయ్య నాయకర్ కళారంగాల్లో రాణిస్తూ కురుగోడు తాలుకాలోని పలు గ్రామాల్లో పౌరాణిక నాటకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు కళాకారులను గుర్తించి వారికి జిల్లాస్థాయిలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సీఐ విశ్వనాథ్ హిరేగౌడ మాట్లాడుతూ యువత టీవీ, మొబైల్, కంప్యూటర్ల మోజులో పడడంతో పౌరాణిక నాటకాలపై ఆసక్తి తగ్గిందన్నారు. పౌరాణిక నాటకాలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకుని కళాకారులకు గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షప్ప, తిమ్మనగౌడ, ముంద్రుగి బసవనగౌడ, శేఖరయ్య స్వామి, శిరిగేరి షణ్ముఖ, కుమారప్ప, పార్వతీశ స్వామి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వంట సహాయకుల సేవలు అమోఘం



ఉద్యోగ విరమణ పొందిన వంట సహాయకులకు సన్మానం చేస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జూన్ 29 : హాస్టల్‌లో వంట సహాయకుల సేవలు అమోఘమని తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో శనివారం పదవీ విరమణ పొందిన సహాయకులకు వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిరంతరసేవలు చేసిన వంటసహాయకుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్లు మల్లికార్జున కాలప్ప, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపాలను సరిదిద్దాలి / గ్యారెంటీ స్కీమ్ ఇంప్లిమెంటేషన్ అథారిటీ సమావేశంలో ఏడీసీ జుబేరా



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహ్మద్‌జుబేరా

బళ్లారి సిటీ, జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదు హామీ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సాంకేతిక సమస్యలుంటే సంబంధిత శాఖ అధికారులు వెంటనే సరిదిద్దాలని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్‌జుబేరా సూచించారు. అనంతపురం రోడ్డులోని నూతన జిల్లా పరిపాలన భవనంలో శనివారం ఏర్పాటు చేసిన గ్యారెంటీ స్కీమ్ ఇంప్లిమెంటేషన్ అథారిటీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శక్తియోజన, గృహలక్ష్మి, గృహజ్యోతి, అన్నభాగ్య, యువనిధి వంటి ఐదు హామీ పథకాలను జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు కమిటీని ఏర్పాటు చేశామని, ఎక్కడైనా లోపం ఉంటే చైర్మన్, సభ్యుల దృష్టికి తీసుకురావాలన్నారు.

హామి పథకాల అమలు జిల్లా అధ్యక్షులు కే.ఈ.చిదానందప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హామీ పథకాల వల్ల జిల్లాలో వేలాది కుటుంబాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు. ఇంప్లిమెంటేషన్ కమిటీ సిబ్బంది ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి ప్రణాళికను వివరించారు. సాంకేతిక సమస్యలతో పథకంలో లబ్ధిపొందలేకపోయిన వారికి అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు హామీ పథకాలపై సమాచారం కావాలంటే సంబంధిత శాఖ అధికారులు తగిన పరిష్కారం చూపాలన్నారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయ్ కుమార్ గృహలక్ష్మి యోజనపై సమాచారం ఇస్తూ జిల్లాలో మొత్తం 9,11,180 రేషన్ కార్డులు ఉన్నాయని అందులో అంత్యోదయ ఏపీఎల్, బీపీఎల్ కార్డులు కలిపి 2,81,987 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. జిల్లాలో ప్రతినెలా గృహలక్ష్మి యోజనకు రూ.55కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు గృహలక్ష్మి డబ్బును డిపాజిట్ చేయని వారి కోసం ఎన్‌పీసీఐ యాక్టివ్‌గా ఉందో లేదో ప్రజలు తనిఖీ చేయాలన్నారు. బ్యాంకు ఆధార్ అనుసంధానం కోసం ఒకసారి ఈకేవైసీ చేస్తే పదే పదే చేయాల్సిన అవసరం లేదన్నారు. గృహలక్ష్మి ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదని ప్రభుత్వం ఇప్పటికే హామీఇచ్చిందని తెలిపారు. ఈసమావేశంలో శక్తి యోజన, గృహజ్యోతి, అన్నభాగ్య, యువనిది వంటి ఇతర హామీ పథకాల అమలు పురోగతిపై చర్చించారు. సమావేశంలో హామీ పథకానికి సబంధించిన జిల్లా స్థాయి అధికారులు, తాలూకా స్థాయి అధ్యక్షులు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో కొట్టూరు బసవేశ్వరస్వామి

కంప్లి, జూన్ 29 : విజయనగర జిల్లాలోని పలుఆలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆనెగొంది కిష్కింధ వద్ద అంజనాద్రి బెట్టపై వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రతో పాటు రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి భక్తులు ఆంజనేయస్వామి జన్మస్థలాన్ని దర్శించుకున్నారు. అలాగే జిల్లాలోని కొట్టూరు బసవేశ్వరాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపట్టారు. భక్తాదులు కాలినడకతో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హోసూరు జోన్

ఆయుర్వేద వైద్యంతో కళ్లకు చికిత్స



కంటి సమస్యలకు వైద్యం చేస్తున్న దృశ్యం

హోసూరు జూన్ 29 : హోసూరులో బ్రహ్మ సరస్వతికొండ వెల్ఫేర్ ట్రస్ట్ తరఫున ఆంధ్రసమితిలో కలికం అనే సంప్రదాయ వైద్యాన్ని శనివారం ఉచితంగా నిర్వహించారు. కలికం అనేది సిద్ద వైద్యంలో కంటికి సంబంధించిన వ్యాధులను నయంచేసే పద్ధతి. కళ్లలో మూలికల రసంతో కొబ్బరి నీళ్ల, మిరియాల రసం కలిపి చుక్కలు వేస్తారు. ఈ సిద్ద వైద్యశిబిరంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కళ్లలో శుక్లాలు, దగ్గరి చూపు, దూరదృష్టి, కళ్లలో నల్లమచ్చలతోపాటు అన్ని రకాల చర్మవ్యాధులకు ఇక్కడ నిత్యం చికిత్స చేస్తారన్నారు. దీని ద్వారా అనేక వ్యాధులు నయమవుతాయని తెలిపారు. ముఖ్యంగా ఈ శిబిరంలో కంటి చుక్కల కోసం వచ్చేవారు మాంసాహారం భుజించి రాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మెన్ ప్రభాకరన్, జాయింట్ సెక్రటరీ శశికళ ప్రభాకరన్, చిన్నప్ప సూర్యనారాయణన్ అరుణాచలం, జయరామన్, పురుషోత్తన్, సదాశివం లోకనాథన్, డాక్టర్ వైరం తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాల వల్ల ఎన్నో ప్రయోజనాలు

హోసూరు, జూన్ 29: సూక్ష్మపోషకాల వలన భూమికి ఎన్నో ప్రయోజనాలున్నాయని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, హోసూరు భువనేశ్వరి రైతులకు వివరించారు. హోసూరు వ్యవసాయ శాఖ విస్తరణ పథకాల సబ్సిడీ పథకం క్రింద కెలవరపల్లి పంచాయతీలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంపై శనివారం శిక్షణశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి పథకం ప్రయోజనాల గురించి, ముఖ్యమంత్రి భూసార పథకం సబ్సిడీ వివరాల గురించి తెలియజేశారు. అదియమాన్ కళాశాల పరిశోధనా కేంద్రం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సమీకృత పోషకాల నిర్వహణ ప్రాముఖ్యత, సమీకృత ఎరువుల నిర్వహణ ప్రయోజనాలు, సేంద్రియ వ్యవసాయం, పంచగవ్య కంపోస్టు తయారీ. వాటి లాభాల గురించి రైతులకు వివరణ ఇచ్చారు. అలాగే ఈ కసరత్తులో పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు పుట్టారెడ్డి, కెలవరపల్లి పంచాయతీ రైతులు హాజరై వ్యవసాయ శాఖ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హోసూరు వ్యవసాయ అధికారిణి రేణుక రైతులకు మట్టి సేకరణ ప్రాముఖ్యత, భూసార నిర్వహణ వల్ల కలిగే ప్రయోజనాలు, విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు, జీవ ఎరువులవల్ల ప్రయోజనాలు, వేసే పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం, ఏఈ పూర్ణిమ వ్యవసాయ షెడ్ల ఏర్పాటుకు సంబంధించిన గ్రాంట్ వివరాలు, వివిధ సబ్సిడీ పథకాల గురించి అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో హోసూరు సహాయ వ్యవసాయ అధికారి గోవిందస్వామి, ఆత్మ ప్రాజెక్టు టెక్నికల్ మేనేజర్ సుగుణ, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ షణ్ముగం పాల్గొన్నాను.



రాష్ట్ర విస్తరణ సబ్సిడీ పథకం గురించి వివరిస్తున్న ఏడీఏ

అక్రమ నిర్మాణాల తొలగింపునకు బ్రేక్



ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న అనుమతిలేని దుకాణాలు

రాయచూరు, జూన్ 29: నగరసభ పరిధిలోని మామిడి చెరువు సలాన్ని ఆక్రమించి, అనధికారికంగా నిర్మాణం చేపట్టిన ఇళ్లను కూల్చివేయడం అర్ధంతరంగా ఆగిపోయింది. నాలుగు నెలల క్రితం ఈ ప్రాంతంలో 11 దుకాణాలు వెలువగా ఇవి అనధికారికంగా నిర్మించారంటూ వీటికి నగరసభ నుంచి ఎలాంటి అనుమతి లేదని వీటిని తొలగించాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటి పై సమగ్ర విచారణ జరిపిన జిల్లాధికారి అనుమతులు లేని వాటిని తొలగించాలని ఆదేశించడంతో శనివారం నగరసభ అధికారులు పోలీసుల సహాయంతో కూల్చివేతలు ప్రారంభించారు. కూల్చివేతల పని ప్రారంభమైన గంటలోగానే నగరసభ సభ్యుడు పవన్‌కుమార్ అక్కడికి చేరుకుని అక్రమంగా నిర్మించిన వారే వాటిని తొలగిస్తారంటూ అధికారులకు నచ్చజెప్పడంతో వారు వెనుదిరిగారు. దీనిపై కూడా పలు అనుమానాలు వెల్లువెత్తాయి. కాగా అక్రమంగా నిర్మించిన 11 దుకాణాలకు గాను ఆరుగురి పేర్లను గుర్తించిన అధికారులు మిగతా ఐదుగురు ఎవరని గుర్తించలేకపోవడం చర్చనీయాంశమైంది.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

రాయచూరు, జూన్ 29: ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ సమీపంలోని కనసామి గ్రామంలో చోటు శనివారం చేసుకుంది. కనసామి గ్రామానికి చెందిన యువకుడు సంతోష్(22) తన సొంత వదిన సోదరిని ప్రేమించి పెళ్లి చేసుకుందామని కోరగా ఆమె అందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు వాట్సప్‌లో తాను ఎంత ప్రేమికుడినైనా ప్రేమలో ఓడిపోయానంటు తాను ప్రేమ పిచ్చివాడినంటూ వాట్సప్‌లో మేసేజ్ పెట్టాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ముదగల్ పోలీసులు కేసు నమోదు చేశారు.